సాక్షి కామారెడ్డి

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025

I



కన్నీరు మిగిల్చిన వాన

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు.

- IIIలో ▸



రోడ్లు ఇలా..

భారీ వర్షాలతో రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా మార్గాలలో వెళ్లేవారు ఇబ్బందిపడు తున్నారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం

31.4 /21.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఆర్ఐ

- ఆర్మీ జవాన్ నుంచి రూ. 7 వేలు లంచం తీసుకుంటూ..



నిందితుడు శ్రీనివాస్

నిజామాబాద్ సిటీ: వీఎల్‌టీ (వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్) సర్టిఫికెట్ కోసం రూ.7 వేలు లంచం తీసుకుంటూ నిజామాబాద్ నగర పాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కాడు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌కు చెందిన ఆర్మీ జవాన్ ఒకరు ఖాళీ స్థలంలో జ్యూస్‌సెంటర్ కోసం అనుమతులు తీసుకున్నాడు. దీనికి సంబంధించిన వీఎల్‌టీ (వెకెంట్ లాండ్ ట్యాక్స్) సర్టిఫికెట్ కోసం బల్దియాలో దరఖాస్తు చేసుకొని ఫీజు చెల్లించాడు. కానీ అనుమతి పత్రం ఇచ్చేందుకు ఆర్ఐ శ్రీనివాస్ రూ.12 వేలు డిమాండ్ చేశారు. తాను ఆర్మీ జవాన్ అని చెప్పినా ససేమిరా అన్నాడు. ఆర్మీ అయితే బోర్డర్‌లో.. ఇక్కడ డబ్బులిస్తేనే పనులు అవుతాయి అనడంతో జవాన్ ఆత్మాభిమానం దెబ్బతింది. చివరకు రూ.10 వేలు ఇస్తానని ఒప్పుకొని ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బల్దియాలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఆర్మీ జవాన్ వద్ద రూ.7 వేల నగదును ఆర్ఐ శ్రీనివాస్ తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ లక్ష్మీకాంత్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌కు సమాచారం ఇచ్చి, ఆర్ఐ శ్రీనివాస్‌ను ఏసీబీ కోర్టుకు తరలించారు.

వరద బాధితులకు పరామర్శ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కౌండిన్య కాలనీలలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం పర్యటించారు. వరద బాధిత కుటుంబాలతో మాట్లాడారు. బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి గురువారం జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీలలో పర్యటించి బాధితులతో మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, నాయకులు పండ్ల రాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్ల పంపిణీ



కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని వరద బాధితులకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బుధవారం నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన అభ్యర్థన మేరకు బాలవికాస అమెజాన్ సంస్థ నిత్యావసర సరుకులతో కూడిన 400 కిట్లను అందజేసిందన్నారు.

'ఒక ఆలోచన జీవితాన్నే మారుస్తుంది'

కామారెడ్డి అర్బన్: ఒక ఆలోచన జీవితాన్నే మార్చివేస్తుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాల టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో బుధవారం ఇన్నోవేషన్ ఐడియాస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఏదో ఒక సృజనాత్మక ఆలోచన దాగి ఉంటుందని, దాన్ని వెలికితీసి కొత్త ఆవిష్కరణలు చేస్తే జీవితం మారిపోతుందన్నారు. టాస్క్ ఐడియాథాన్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరాఖ్య, యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్రతినిధి సంకీర్త్, సమన్వయకర్త రాజ్‌గంభీర్ రావు, అధ్యాపకులు ఫర్హీన్ ఫాతిమా, మెంటార్ అజారొద్దీన్, టాస్క్ జిల్లా మేనేజర్ రఘుతేజ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల జాబితా

కామారెడ్డి అర్బన్: జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ఈనెల 6న ప్రదర్శిస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 9న అభ్యంతరాలను పరిష్కరించి, 10న ఆయా మండలాల ఎన్నికల అధికారులు పోలింగ్ స్టేషన్లవారీగా తుది జాబితాను ప్రకటిస్తారని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయాల్లో సమావేశాలు, జాబితాల ప్రదర్శన ఉంటాయదని పేర్కొన్నారు.

భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. వరద ఇళ్లను చుట్టేసింది. పంటలను ముంచేసింది. రోడ్లను ధ్వంసం చేసింది. వాగుల ప్రవాహ ఉధృతికి వంతెనలు కొట్టుకుపోయాయి. మునుపెన్నడూ చూడని వరదలతో జిల్లాలో భారీ నష్టం వాటిల్లింది. ఈ నష్టాన్ని పరిశీలించడానికి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం జిల్లాకు వస్తున్నారు. ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని జిల్లావాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

దెబ్బతిన్న లింగంపేట మండలంలోని నాగారం వంతెన



కరుణ వర్షం కురిసేనా?

- భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జిల్లా
- రూ. వందల కోట్ల మేర నష్టం
- నేడు జిల్లాలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలంటున్న జిల్లావాసులు



పాల్వంచ మండలం ఆరెపల్లిలో కొట్టుకుపోయిన పంట

జిల్లాలో గతనెల చివరి వారంలో కురిసిన భారీ వర్షాలు భారీ నష్టాన్ని మిగిల్చాయి. వరదలు, వర్షాలతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 118 పశువులు చనిపోగా, 53,270 కోళ్లు మృత్యువాతపడ్డాయి. చాలాచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. చెరువులు, కుంటలే కాదు ప్రాజెక్టులూ ప్రమాదాన్ని ఎదుర్కొన్నాయి. ఇళ్లు నీట మునిగి సర్వస్వం కోల్పోయిన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. 1,454 ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. విద్యుత్ శాఖకు సంబంధించి 38 గ్రామాల్లో 864 పోల్స్, 51.84 కిలోమీటర్ల మేర వైర్లు, 589 విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వరదలతో జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, చెరువులు, ప్రాజెక్టులకు తాత్కాలిక మరమ్మతులు చేయించడానికి రూ.38.68 కోట్లు, పూర్తి స్థాయి పనులకు రూ.212.68 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు.

50 వేల ఎకరాలలో పంట నష్టం..

వరదలతో పొలాలు నీటమునిగి పంటలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల పంటలు కొట్టుకుపోయాయి. ఇసుక మేటలు వేయడంతో మరింత నష్టం వాటిల్లింది. అధికారిక లెక్కల ప్రకారమే జిల్లాలో 334 గ్రామాల్లో 37,313 మంది రైతులకు సంబంధించి 50,028 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.



కొట్టుకుపోయిన కల్యాణి ప్రాజెక్టు కట్ట

మరో 140 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగింది. అయితే అంతకు రెట్టింపు విస్తీర్ణంలో పంటలు నాశనమయ్యాయని రైతులు పేర్కొంటున్నారు.

నీటిపారుదల రంగానికి రూ. 41 కోట్లు...

వర్షాలతో పోచారం ప్రాజెక్టు, కల్యాణి ప్రాజెక్టు, సింగీతం రిజర్వాయర్లతో పాటు 157 చెరువులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టు ఒక దశలో కొట్టుకుపోతుందనే ఆందోళన వ్యక్తమైంది. వందేళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టు స్ట్రక్చర్ గట్టిగా ఉండడంతో అంత పెద్ద వరదను తట్టుకుని నిలబడింది. కట్ట కొంత కోతకు గురవగా తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. కల్యాణి వాగు ప్రాజెక్టు, సింగీతం రిజర్వాయర్ల కట్టలు కొట్టుకుపోయాయి. వాటిని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉంది. చెరువులకు చాలాచోట్ల గండ్లు పడ్డాయి. కాలువలు కూడా కొట్టుకుపోయాయి. వాటికి తాత్కాలిక మరమ్మతులకు రూ.5 కోట్లు వెచ్చిస్తుండగా.. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడానికి రూ.36 కోట్లు అవసరమని నీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేశారు.

పంచాయతీరాజ్ శాఖ అంచనాలు..

కామారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో 122 రోడ్లు, కల్వర్టులు దెబ్బతినగా వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ.8 కోట్లు అవసరం అవుతాయని పంచాయతీరాజ్ శాఖ అధికారులు నివేదికలు రూపొందించారు. పూర్తి స్థాయిలో మరమ్మతులకు రూ.37.50 కోట్లు అవసరమని అంచనాలు తయారు చేశారు.



కొట్టుకుపోయిన పాముల వాగు వంతెనకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం (ముఖ్యమంత్రి ఈ వంతెనను పరిశీలించనున్నారు)

ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.125.50 కోట్లు అవసరం

జిల్లాలో రోడ్లు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ)కు సంబంధించి 65 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. 48 కల్వర్టులు పాడయ్యాయి. చాలాచోట్ల రోడ్లు, కల్వర్టులు దెబ్బతినిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు గ్రామం వద్ద ఉన్న కల్వర్టు వరదలో కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. అధికారులు కష్టపడి తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ రాకపోకలకు ఇబ్బందిగానే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి దీనిని పరిశీలించనున్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో రోడ్లు, కల్వర్టులు దెబ్బతినడంతో రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లు, కల్వర్టుల తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.5.50 కోట్లు, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడానికి రూ.120 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు.

సీఎం పర్యటన ఇలా...

కామారెడ్డి జిల్లా పర్యటన కోసం సీఎం గురువారం ఉదయం 10.45 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

- రేవంత్‌రెడ్డి ప్రయాణించే హెలీకాప్టర్ 11.30 గంటలకు తాడ్వాయి మండలం ఎర్రాపహడ్ శివారులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద ల్యాండ్ అవుతుంది.
- అక్కడి నుంచి సీఎం రోడ్డు మార్గాన లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు వద్ద దెబ్బతిన్న ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన వంతెనను పరిశీలిస్తారు.
- బూరుగిద్ద శివారులో వరదలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రోడ్డు మార్గాన 1.10 గంటల వరకు కామారెడ్డి పట్టణ శివారులోని జీఆర్ కాలనీని సందర్శించి, బాధితులతో మాట్లాడతారు.
- 2 గంటలకు కలెక్టరేట్ భవనానికి చేరుకుని ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు.
- కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజనం ముగించిన అనంతరం సమావేశ మందిరంలో 2.20 గంటల నుంచి 3 గంటల వరకు అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 3 గంటలకు బయలుదేరి జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని హెలీప్యాడ్‌కు చేరుకుని హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

హెలీప్యాడ్ స్థల పరిశీలన



హెలీప్యాడ్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర

లింగంపేట/తాడ్వాయి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం లింగంపేట మండలంలో పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఎర్రాపహడ్ శివారులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వాగు వంతెనను ముఖ్యమంత్రి పరిశీలించనున్న నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వంతెన వద్ద జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రికి వివరించడానికి సిద్ధంగా ఉండాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. బూరుగిద్ద శివారులో పంటలు పరిశీలించే సమయంలో నష్టాన్ని వివరించేందుకు వ్యవసాయాధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, అడిషనల్ కలెక్టర్ చందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం ఆయన ఎస్పీ రాజేశ్ చంద్రతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న జిల్లాలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలోని జీఆర్ కాలనీలో పర్యటించి సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో జరిగే వరదలపై సమీక్ష, ఫొటో ఎగ్జిబిషన్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ చందర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరోసారి ఉపఎన్నిక!

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మరోసారి ఉప ఎన్నిక అనివార్యం కానుంది! బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ తరువాత ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించడంతో 'ఉప ఎన్నిక' చర్చ తెరపైకి వచ్చింది. ఎమ్మెల్సీ స్థానానికి 2020లో ఒకసారి ఉప ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే.

- రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కవిత
- మండలి ఛైర్మన్ ఆమోదిస్తే ఉప ఎన్నిక పెట్టాల్సిందే
- 2020 ఉప ఎన్నికలు, 2022 ఎన్నికల్లో కవిత విజయం
- స్థానిక సంస్థల ఎన్నికల తరువాతే ఉప ఎన్నికకు అవకాశం
- తాజా పరిస్థితులపై జోరుగా చర్చలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారం మరో ఉప ఎన్నికకు దారితీసింది. పార్టీ నుంచి వేటుపడిన వెంటనే ఆమె తన శాసన మండలి సభ్యత్వానికి సైతం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఉప ఎన్నికపై జోరుగా చర్చ సాగుతోంది. 2019లో ఎంపీగా ఓటమిపాలైన కవిత.. 2020లో జరిగిన ఉప ఎన్నికలో స్థానికసంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీగా ఉన్న డాక్టర్ భూపతిరెడ్డిపై అనర్హత వేటుపడడంతో ఉప ఎన్నిక రాగా, కవిత బరిలో నిలిచి గెలిచారు. ఆ స్థానం కాలపరిమితి ముగియడంతో 2022 జనవరిలో నిర్వహించిన ఎన్నికల్లో కవిత మరోసారి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2028 వరకు కాలపరిమితి ఉన్నప్పటికీ తాజా పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. శాసనమండలి చైర్మన్ ఆమె రాజీనామాను ఆమోదిస్తే ఉప ఎన్నిక నిర్వహించాల్సిందే. ప్రస్తుతం రాష్ట్రంలో 'స్థానిక' ఎన్నికల వాతావరణం ఉండగా.. అదే కోటాలో నిర్వహించాల్సిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఆలస్యం అవడం ఖాయం. ఉప ఎన్నిక నిర్వహించాలంటే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంటుంది.

ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. ఉప ఎన్నికలకు ఆస్కారమిచ్చారు..

2016 జనవరిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా డాక్టర్ భూపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే భూపతిరెడ్డి కాంగ్రెస్ నుంచి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా పోటీ చేయడంతో 2020లో అనర్హత వేటుకు గురయ్యారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ సమయంలో నిర్వహించిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన కవిత, తరువాత జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ వేటుకు గురైన కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. స్పీకర్ ఆమోదిస్తే, స్థానిక ఎన్నికలు పూర్తయ్యాక ఉప ఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటోంది.

రేవంతన్నా.. ఉద్యోగం రాలేదన్నా..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : లింగంపేట మండలం నల్లమడుగు గ్రామంలో నాలుగేళ్ల క్రితం వడ్ల కుప్ప కాడ కావలిగా ఉన్న మెట్టు ప్రభాకర్ (28) అనే రైతు పాము కాటుతో చనిపోయాడు. అప్పట్లో పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రూ.లక్ష సాయం అందించారు. అక్కడి నుంచే ఆర్డీవోకు ఫోన్ చేసి పదో తరగతి చదివిన ప్రభాకర్ భార్య ప్రసన్నకు అంగన్‌వాడి ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. అధికారులు చూస్తామని మాటిచ్చి వదిలేశారు. అప్పుడు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి తర్వాత ముఖ్యమంత్రి అయ్యారు. గురువారం లింగంపేట మండలానికి వస్తున్నారు. భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలను పోషించడానికి ప్రసన్న ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తనకు భరోసా ఇస్తారని ఆమె ఆశిస్తోంది. ఏదైనా ఉపాధి, ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆమె కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



రైతు ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

ఎరువు కోసం జాగారం

రామారెడ్డి: రామారెడ్డికి గురువారం యూరియా వస్తుందన్న సమాచారం తెలియడంతో రైతులు బుధవారం రాత్రే రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. దుప్పట్లు, చద్దర్లు తెచ్చుకుని వేదిక ఆవరణలో నిరీక్షిస్తున్నారు. రాత్రంతా జాగారం చేసినా ఒక్క బస్తా అయినా దొరుకుతుందో లేదోనని నాగరాజు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి సరిపడా ఎరువులు పంపించాలని కోరాడు.

గతంలో క్యూలైన్‌లో ఓ రైతు మృతి..

2011లో యూరియా కొరత ఏర్పడింది. అప్పట్లో రైతులు బారులు తీరారు. రామారెడ్డికి చెందిన ఊషయ్య అనే రైతు క్యూలైన్‌లో అనారోగ్యానికి గురై మరణించాడు. ఆ పరిస్థితి తలెత్తకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



రైతు వేదిక వద్దనున్న రైతులు



రాజంపేటలో క్యూలైన్‌లో చెప్పులు ఉంచిన రైతులు

తప్పని యూరియా తిప్పలు

రాజంపేట: మండల కేంద్రంలోని సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. బుధవారం ఉదయం 7 గంటలకే సొసైటీ వద్దకు చేరుకొన్న రైతులు వరుసలో చెప్పులను ఉంచి గంటల తరబడి వేచి ఉన్నారు. సొసైటీలో 240 బస్తాలే అందుబాటులో ఉండడంతో ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున మాత్రమే అందించారు. యూరియా కొరత ఉందనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని సొసైటీ సీఈవో వెంకటేశ్వర శర్మ తెలిపారు. మరో రెండు రోజుల్లో 480 బస్తాలు వస్తాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుడిని ఆదుకోవాలి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ వాటర్‌వర్క్స్ విభాగంలో విధులు నిర్వహించి ఇంటికి వెళుతూ ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న కార్మికుడు మాసుల లింగంను ఆదుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నర్సింగ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కుప్రియాల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిపారు.

పోటాపోటీగా రక్తదానం చేయాలి

కామారెడ్డి అర్బన్:పోటాపోటీగా వినాయని ఉత్సవాలు నిర్వహించిన యువకులు అదే స్ఫూర్తితో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు,ఆపదలో ఉన్న రోగులకు రక్తదానం చేయడానికి శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయ కర్త బాలు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయడానికి యువజన సంఘాలు ముందుకు వస్తే అందుకు ఏర్పాట్లు అన్నీ తాము చూసుకుంటామని బాలు పేర్కొన్నారు. వివరాలకు 94928 74006, 88973 49872 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి




పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ అనిల్ కుమార్ సూచించారు. బుధవారం కాటేపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలలో వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. అనంతరం కాటేపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్ఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గణేశ్ శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని ఎస్సై పుష్పరాజ్ సూచించారు. బుధవారం ఆయన డీజే నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు డీజే నిర్వాహకులకు ముందస్తుగా డబ్బులు ఇచ్చి ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఏకదంతుడు.. భిన్న రూపాలు

జిల్లా కేంద్రంలో ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహాలు



జిల్లా కేంద్రంలో సరోజినిదేవి రోడ్‌లో ప్రతిష్ఠించిన బాల వినాయకుడు

కామారెడ్డి టౌన్: నవరాత్రుల పాటు జిల్లా కేంద్రంలో వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భారీ సెట్టింగ్ మండపాలలో విభిన్న రూపాల్లో వినాయకులను ప్రతిష్ఠించారు. వీక్షకులను ఈ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.



గొల్లవాడ కాలనీలోని వినాయకుడు.. నిర్వాహకులు ఏర్పాటు చేసిన పుంగనూరి ఆవులు



జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్‌లో మర్రి చెట్ల ఊడలలో జపం చేస్తున్న శివుని రూపంలో వినాయకుడు



సిరిసిల్ల రోడ్‌లో ఆపరేషన్ సిందూర్ వినాయకుడు



రామారెడ్డి: హిందూ దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడు



ఎడ్ల బండి నడుపుతున్న రైతు వినాయకుడు



పొట్టి శ్రీరాములు విగ్రహం ముందు క్రికెట్ ఆడుతూ..

అన్నదానాలు.. శోభాయాత్రలు..నిమజ్జనం



గాంధారిలో పూజలో పాల్గొన్న ఎస్సై ఆంజనేయులు

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో గణేశ్ మండపాల వద్ద వినాయకుడు బుధవారం ప్రత్యేక పూజలు అందుకున్నాడు. భక్తులు నైవేద్యాలను సమర్పించారు. పలు చోట్ల నిర్వాహకులు అన్నదానాలు చేశారు. కొన్ని గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించి విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గోపాల్‌పేటలో సామూహిక కుంకుమార్చన



గాంధారి మండలం తిమ్మాపూర్‌లో..



భిక్కనూరు: గురునానక్ యూత్ క్లబ్ అన్నదానం



బీర్కూర్‌లో భజనల మధ్య నిమజ్జనానికి తరలుతూ..



రాజంపేటలో హిందూదళ్ యూత్ సభ్యులు ప్రతిష్ఠించిన బెల్లంతో తయారుచేసిన గణేశుడు



నర్వలో నృత్యాలు చేస్తున్న మహిళలు

సీఎం ఈసారైనా దయచూపేనా?

- కాళేశ్వరం 22వ ప్యాకేజీకి నిధులిస్తేనే సాగునీటి కష్టం తీరేది
- ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి
- వైద్య సేవలు మెరుగుపడాలి
- కేకేవై రోడ్డును హైవేగా అభివృద్ధి చేయాలి
- జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ జరగాలి
- సమగ్ర అభివృద్ధికి కృషి అవసరం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో అనేక సమస్యలు వెక్కిరిస్తున్నాయి. సాగునీటి సమస్య, విద్య, వైద్య రంగాలతో పాటు పారిశ్రామికరంగాల్లోనూ వెనుకబడే ఉంది. కరీంనగర్–కామారెడ్డి–ఎల్లారెడ్డి(కేకేవై) రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలి. జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణకు నిధులు ఇవ్వాలి. ఇంకా ఎన్నో చేయాల్సినవి ఉన్నాయి. కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే ఈ ప్రాంత ప్రజలు గౌరవ ప్రదమైన ఓట్లు వేశారు. ప్రజల ఆశలకు అనుగుణంగా అభివృద్ధికి నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

● కామారెడ్డి నియోజక వర్గంతో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాలుగైదు మండలాలకు సాగునీరందించేందుకు రూపొందించిన 22వ ప్యాకేజీ పనులు ఏళ్లుగా ముందుకు కదలడం లేదు. భూసేకరణతో పాటు పనులు చేపట్టేందుకు నిధులు ఇవ్వాల్సి ఉంది.

● విద్యారంగానికి సంబంధించి కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు జరగాలి. ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో ఇంజినీరింగ్ కాలేజీ, బీఎడ్, డీఎడ్ కాలేజీలు ఏర్పాటు చేయాలి. కామారెడ్డికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ రావాలి. సౌత్ క్యాంపస్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి.

● వైద్య రంగానికి సంబంధించి స్థానికంగా వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులున్నాయి. అయితే ఆస్పత్రిలో స్కానింగ్ మిషన్ లేక బయట చేయించుకునే పరిస్థితి ఉంది. ఆస్పత్రి, మెడికల్ కాలేజీ భవనాల పనులు త్వరగా పూర్తి చేసి సౌకర్యాలు మెరుగుపర్చాలి. ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బిచ్కుంద, మద్నూర్, పిట్లం, మద్నూర్ ఆస్పత్రుల్లో వైద్యులను నియమించాలి.

● జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు నిర్మించాలి. జంక్షన్ల అభివృద్ధి చేపట్టి ఇబ్బందులు తొలగించాలి. విలీన గ్రామాలకు ప్రత్యేక నిధులివ్వాలి.

● కేకేవై రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయడానికి నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. కరీంనగర్ నుంచి కామారెడ్డి, ఎల్లారెడ్డి మీదుగా పిట్లం వరకు ఉన్న ఈ రోడ్డు రవాణా రంగంలో కీలకమైనది. మూడు రాష్ట్రాలను కలిపే రహదారిగా దీన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది.

● పారిశ్రామిక ప్రగతిలో వెనుకబడిపోయాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులకు తగిన ప్రాధాన్యతనివ్వాలి. ఇదే సమయంలో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

● జిల్లా కేంద్రాన్ని రెండుగా విభజించే రైల్వే ట్రాక్‌పై వంతెనలు నిర్మించకపోవడంతో నిత్యం ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

బార్ కౌన్సిల్ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి



జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ భవనంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కామారెడ్డి టౌన్: బార్ కౌన్సిల్ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నంద రమేష్, బండారి నరేందర్‌లు డిమాండ్ చేశారు. జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ భవనంలో న్యాయవాదుల డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. పదవీ కాలం ముగిసినా ఆరేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టులో వేసిన కేసుకు జవాబు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ పదవులను పొడిగించుకోవడం సరికాదన్నారు. రెండు నెలలలోపు బార్ కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించాలని లేకుంటే న్యాయవాదులు చలో హైదరాబాద్ పిలుపునిచ్చి పోరాటం చేస్తామని తెలిపారు. న్యాయవాదులు శ్యామ్ గోపాల్ రావు, క్యాతం సిద్ధరాములు, జగన్నాథం, దేవరాజ్ గౌడ్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చింతల గోపి పాల్గొన్నారు.

సరిపడా యూరియా ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రైతులకు సరిపడా యూరియాను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని భారతీయ కిసాన్ సంఘం(బీకేఎస్) గ్రామ అధ్యక్షుడు కుమార్ సింగ్ పేర్కొన్నారు.బుధవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో రోడ్డుపై రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతాంగం చాలా ఇబ్బందిలో ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యూరియాను అందుబాటులో తెచ్చి రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు.అనంతరం నాయబ్ తహసీల్దార్ చంద్రకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నేతలు బోడి రాజు యాదవ్, బోడి మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన





నస్రుల్లాబాద్: సంగం, సంగం(ఏ), మిర్జాపూర్, నాచుపల్లి గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్ పరిశీలించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగు నీరు, మరుగుదొడ్ల సదుపాయాలను పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, పంచాయతీ కార్యదర్శి అనిల్ ,గ్రామస్తులు ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని పలు గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ప్రకాష్ బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న సమస్యలను ఆయన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలు తదితరులున్నారు.

ఎర్రాపహాడ్‌లో సివిల్ రైట్స్ డే

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో బుధవారం సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మూఢనమ్మకాలను వీడాలని, అంటరానితనం ఉండవద్దని, అందరు సమానంగా ఉండాలని సూచించారు. ఆర్ఐ హారిక, రెవిన్యూ, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శివ(ఫైల్)

పిట్లం: పటాన్‌చెరు సమీపంలో బొలెరో వాహనం ఢీకొని పిట్లం మండలం హస్నాపూర్‌కు చెందిన శివ(28) అనే యువకుడు మృతి చెందిన ఘటన బువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పటాన్‌చెరు సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న శివను వేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివ అక్కడికక్కడే మృతి చెందాడు. శివ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: సారంగపూర్ హనుమాన్ ఆలయం గోశాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి(65–70) చెందినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు బుధవారం తెలిపారు. ఈ నెల 1న గోశాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సదరు వ్యక్తిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659848, 8712659734 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

పాత కలెక్టరేట్‌లో గంజాయి విక్రయం!

ఖలీల్‌వాడి: నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో గుర్తు తెలియని వ్యక్తులు గంజాయిని విక్రయించేందుకు వచ్చినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. పాత కలెక్టరేట్ మైదానంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఒకటో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పట్టుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వస్తున్నారనే సమాచారంతో గంజాయి విక్రయానికి వచ్చిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు రావడంతో పరారైన చోట ఉంచిన బైకులో 20 ప్యాకెట్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బైక్ ను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. బైక్, చుట్టూ పక్కల ఉండే సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గంజాయి అమ్మే వారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నట్లు తెలిసింది.

గేదెలను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి శివారులో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో రెండు గేదెలకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గేదెలను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు గేదెలు లేవలేని స్థితిలో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు జిల్లావాసులు మృతి
- పాలాజ్ గణేశ్ మందిరానికి వెళ్లి వస్తుండగా ఘటన

వర్ని: మహారాష్ట్రలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. వర్ని మండలం హుమ్నాపూర్, బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన బంధువులు ఐదుగురు బుధవారం ఉదయం కారులో మహారాష్ట్రలోని పాలాజ్ గణేశ్ మందిరానికి వెళ్లారు. దర్శనం అనంతరం రాత్రి తిరిగి వస్తుండగా నాందేడ్ జిల్లా బోకర్ తాలూక ప్రాంతంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న చేకూరి బుల్లి రాజు(50), అతని భార్య సునీత (45), వాణి (38) అక్కడికక్కడే మృతి చెందగా, గున్నం చంద్రశేఖర్ (35), నీలిమా(45)కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్, భైంసా ఆస్పత్రులకు తరలించారు.

చెరువులో దూకి అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్య

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన బెల్లెడిగె చిన్ను (44) స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం తెలిసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్ను, పోతన్న భార్యాభర్తలు. చిన్ను కంఠేశ్వర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తోంది. పోతన్న చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ఇల్లు చిన్నది కావడంతో న్యాల్‌కల్ రోడ్‌లోని లలితానగర్‌లో అద్దె ఇంట్లో ముగ్గురు పిల్లలతో ఉంటున్నారు. కొంతకాలంగా కుటుంబసభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

ఈక్రమంలో మంగళవారం అర్ధరాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం చిన్ను ఇంట్లో కనిపించకపోయే సరికి భర్త పలుచోట్ల వెతికాడు. పశువుల కాపరులు చెరువులో మృతదేహాన్ని గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 13 మందిలో నలుగురికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ జైలు శిక్షను విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఆధారాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ 9 మందికి రూ. 13 వేల జరిమానా విధించగా, నలుగురికి ఒక రోజు, రెండు, మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు సీఐ తెలిపారు.

భిక్కనూర్‌లో ఆటో చోరీ

భిక్కనూర్: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఓ ప్యాసింజర్ ఆటో చోరీకి గురైంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బండి రవీందర్ తన ఆటోను మంగళవారం రాత్రి స్థానిక చౌరస్తాలో నిలిపి ఇంట్లో నిద్రించాడు. బుధవారం వేకువజామున చూసే సరికి ఆటో కనిపించలేదని బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నవీపేట: గణేశ్ నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై తిరుపతి బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉత్సవాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

హోమియో మందుల పంపిణీ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి వరద బాధితులకు సహస్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి సహకారంతో వైద్య బృందంతో కలిసి పలు వ్యాధుల నివారణకు హోమియోపతి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహస్ర ఫౌండేషన్ చైర్మన్, హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినుకాని శివప్రసాద్, ముఖ్య సలహాదారుడు డాక్టర్ మహేష్, ప్రతినిధులు హరీష్, సమన్వయకర్త సిలివేరు సైదులు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకులాన్ని సీఎం సందర్శించాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సరంపల్లి జాతీయ రోడ్డు వద్ద ఉన్న ఎస్టీ గురుకులాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించాలని బీవీఎం జిల్లా ఇన్‌చార్జి పెరుమాండ్ల బుల్లెట్ చక్రవర్తి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో ఎస్టీ గురుకులం జలమయం కావడంతో విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారన్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ గురుకులానికి తక్షణమే సొంత భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భిక్షపతి, ఎస్సై కళ్యాణి

ధర్పల్లి: మండల కేంద్రంలో మహిళపై కత్తెరతో దాడి చేసి హత్య చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భిక్షపతి తెలిపారు. బుధవారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఎస్సై కళ్యాణితో కలిసి నిర్వహించిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ధర్పల్లికి చెందిన కోటగిరి దాసుకు గంగామణితో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో విడాకులు తీసుకొని వేర్వేరుగా ఉంటున్నారు. తన భార్య దూరం కావడానికి ధర్పల్లికి చెందిన మచ్చ లక్ష్మి, భోజేశ్వర్ అని అనుమానం పెంచుకున్న దాసు వారిని చంపేందుకు ఈనెల 2న లక్ష్మి ఇంటికి వెళ్లాడు. కత్తెరతో ఆమెపై, భోజేశ్వర్ పై దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ లక్ష్మిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దాడిని అడ్డుకునేందుకు వచ్చిన నాలుగురికి సైతం గాయాలు కావడంతో వారు చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని బుధవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: దోపిడీ చేసేందుకు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితునికి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలిలా ఉన్నాయి. మద్నూర్ మండలం మోగె డోంగ్లీ గ్రామానికి చెందిన బరిగె లక్ష్మణ్(60) రుణమాఫీ పని మీద గతేడాది జూన్ 20న మేనూర్ బ్యాంకుకని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. మరుసటి రోజు అతని కుమారుడు అశోక్ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఆ తర్వాత సలాబత్‌పూర్ శివారులో హత్యకు గురైన లక్ష్మణ్ మృతదేహాన్ని గుర్తించారు. సలాబత్‌పూర్‌కు చెందిన ర్యాపన్వాడ సాయిలు అనే వ్యక్తి మృతుడిని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడు సాయిలు చెడు అలవాట్లకు బానిసై డబ్బుల కోసం గతంలోనూ ఓ హత్యకు పాల్పడ్డాడు. లక్ష్మణ్ హత్యకు గురైన రోజున సలాబత్‌పూర్ శివారు లోని బ్రిడ్జి వద్ద రాత్రి 8 గంటల ప్రాంతంలో మృతుడు బస్సుకోసం వేచి ఉండగా అక్కడకు సాయిలు వచ్చాడు. లక్ష్మణ్ వద్ద నున్న డబ్బులు కాజేసేందుకు అతనిపై సాయిలు దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు సాయిలును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ. రెండు వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన పోలీసు అధికారులు నరేశ్, రవికుమార్, విజయ్ కొండ, రాజయ్య, రామేశ్వర్ రెడ్డి, సిబ్బంది సాయన్న, శ్రీకాంత్ లను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.